
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



ఐఓసీలో హైటెన్షన్!

టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం సమీపంలోని ఐఓసీలో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. - 8లో..



శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం

శ్రీశైలం ఘాట్‌లోని పెద్దదోర్నాల మండలంలో తుమ్మలబైలు గిరిజనగూడెం-జంగిల్ సఫారీల మధ్యలో గురువారం టూరిస్టు బస్సు ప్రమాదానికి గురైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /22

వాతావరణం

ఉదయం పొగమంచు అధికంగా ఉంటుంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన శిద్దా



సీఎం జగన్‌తో శిద్దా రాఘవరావు, సుధీర్‌కుమార్

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన తనయుడు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ మోహన్‌రెడ్డిని వీరు కలిశారు.

మార్చి 17, 18 తేదీల్లో జాతీయ స్థాయి సెమినార్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతి రాజశేఖర్

ఒంగోలు: స్థానిక ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌లో మార్చి 17, 18 తేదీల్లో లైఫ్ స్పాన్ మోటారు డెవలప్‌మెంట్ (మానవ జీవిత కాల యాంత్రిక అభివృద్ధి) అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు సెమినార్ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతి రాజశేఖర్ పట్టేటి గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.అంజిరెడ్డి, రెక్టార్ పి.వరప్రసాద్, రిజిస్ట్రార్ బి.కరుణ, వ్యాయామ కళాశాల ఆచార్యులు భట్టు నాగరాజు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వైద్యశాలలో సైకియాట్రిక్ వైద్య సేవలు

మార్కాపురం: మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో సైకియాట్రిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, సైకియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. గురువారం వైద్యశాలలో మీడియాతో వారు మాట్లాడారు. సైకియాట్రిక్ వైద్య సేవలు గుంటూరు, కర్నూలు, ఒంగోలులో మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం డాక్టర్ ఖాజామొహిద్దీన్‌ను నియమించినందున ఇక నుంచి మార్కాపురం జిల్లా వైద్యశాలలో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. మెదడు, నరాలు, మానసిక వైద్యం, చికిత్స, కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. నిద్రలేకపోవడం, దిగులు, తలనొప్పి, భయం, డిప్రెషన్, ఒత్తిడి, కుటుంబ సమస్యలకు ట్రీట్‌మెంట్ చేస్తారని, విద్యార్థులకు పరీక్షల భయం పోగొట్టడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డ్రగ్స్, ఆల్కహాల్ మానిపించేందుకు కౌన్సిలింగ్ ఇస్తారని వివరించారు. వైద్యశాలలోని రూం నంబర్ 17లో ఈ సేవలు లభ్యమవుతాయని, పశ్చిమ ప్రకాశం ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

మార్చి నెలాఖరుకల్లా పన్నులన్నీ వసూలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ, జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అన్ని రకాల పన్నులను మార్చి నెలాఖరుకల్లా వసూలు చేయాలని రీజినల్ డైరెక్టర్ కం అప్పీల్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి నిర్వహించిన సమీక్షలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్‌ను వేగంగా వసూలు చేయాలన్నారు. డిమాండ్ ఉన్న ట్యాక్స్ మొత్తం మార్చి 2023 ఆఖరుకల్లా వసూలు చేయాలని ఆదేశించారు. అందుకోసం కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా పన్నులు వసూలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ విషయంలో సచివాలయ అడ్మిన్లు బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. నివేదికలను వార్డు సచివాలయాల వారీగా ఆర్‌డీ ఎంఏకు పంపాలని సూచించారు.

పచ్చపాతంపై ఆగ్రహ జ్వాల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీపై పచ్చ మీడియా విషపు రాతలకు జిల్లాలో ఆగ్రహ జ్వాలలు పెల్లుబికాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలకు అండగా ఉంటూ ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరస్థానాన్ని పొందారని, దీనిని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ, పచ్చ మీడియా అసత్య ప్రచారాలకు తెగబడ్డాయని వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జరగనిది జరిగినట్టు కనికట్టు వార్తలు ప్రచురిస్తూ బురదజల్లే యత్నాన్ని వారు ఖండించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పచ్చ పత్రికల తీరుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు.



ఒంగోలులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, మహిళా నాయకులు

ఒంగోలు: ఒంగోలు నగరంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ గన్నవరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ నేతలు వ్యవహరిస్తే.. ఆ విషయాన్ని పక్కదారి పట్టించే విధంగా ఈనాడు పత్రిక కథనాలను ప్రచురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన పట్టాభి కథనంలో ఏడాది క్రితం నాటి ఫొటో ప్రచురించి పాఠకులను తప్పుదారి పట్టించారంటూ ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అధికారం కోసం చంద్రబాబు అర్రులు చాస్తున్నారని, ఆయనకు ఎలాగైనా సీఎం పీఠం దక్కేలా చేయాలని పచ్చమీడియా నిత్యం పాకులాడుతోందని, అందులో భాగంగానే ఏడాది క్రితం నాటి పట్టాభి డ్రామా ఫొటోను తాజాగా జరిగినట్లు పేర్కొంటూ ప్రచురించి నాలుక కరుచుకున్నారని ఎద్దేవా చేశారు.

రామోజీ... ప్రజలకు క్షమాపణ చెప్పు..

మార్కాపురం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలను తప్పు దోవ పట్టించేలా ఈనాడు దినపత్రిక తప్పుడు వార్తలు రాస్తూ ప్రజల్లో చెడు భావనలు కలిగిస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి ఆరోపించారు. తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న ఈనాడు చైర్మన్ రామోజీరావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని మరిచిపోయి పాత ఫొటోలు, అసత్య వార్తలు ప్రచురిస్తూ విశ్వసనీయతను పోగొట్టుకున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నేత పట్టాభిపై దాడి చేసినట్టుగా పాత ఫొటోలు ప్రచురించడం చూస్తుంటే.. ఆ పత్రిక ఎంతగా దిగజారిపోయిందో ప్రజలకు అర్థమైందన్నారు. ఆంధ్రజ్యోతి, టీవీ 5 చానళ్లలో నిత్యం అసత్య వార్తలు ప్రచారం చేయడం సాధారణమైపోయిందన్నారు. అనంతరం ఈనాడు దినపత్రికలను చించివేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బాలసుబ్బారావు, కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, ప్రసాద్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, దారివేముల బాబి, సతీష్, మయూరి కాశీం, పార్టీ తర్లుపాడు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఈనాడు పత్రికలను చించివేస్తున్న ఎమ్మెల్యే కేపీ, మున్సిపల్ చైర్మన్, తదితరులు

ఈనాడుపై చర్యలు తీసుకోవాలి...

కనిగిరి రూరల్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనాడు పత్రిక రాతలను ఖండిస్తూ గురువారం కనిగిరిలోని పామూరు రోడ్డులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనాడు దిన పత్రిక ప్రతులను దహనం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రసంగించారు. ఈనాడు పత్రిక అవాస్తవాలు రాస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య వార్తలు రాస్తూ, వైఎస్సార్ సీపీని బదనాం చేయడమే పనిగా పెట్టుకుందని ఘాటుగా విమర్శించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేత పట్టాభిపై పోలీసులు, వైఎస్సార్ సీపీ నాయకులు దాడులు చేయకపోయినా పాత ఫొటోలు పెట్టి పట్టాభిని కొట్టినట్లు అసత్య వార్తలను ఈనాడులో ప్రచురించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, డాక్టర్ రసూల్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సీహెచ్ కిషోర్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ శ్రీరాం సతీష్, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీనివాసులు, రాజేష్, తిరుపతయ్య, నక్కా రామకృష్ణ, టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ జానీ, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, నాగూర్‌వలి, కంటు గురవయ్య, రెహమాన్, మన్సూర్, మీరావలి, నాగూర్‌వలి, ఖాజా, మండల యూత్ అధ్యక్షుడు మాలీ యాదవ్, రవి, సర్పంచ్ నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు మానుకోవాలి

టంగుటూరు: ఈనాడు దినపత్రిక తప్పుడు వార్తలు ప్రచురించడం మానుకోవాలని, చైర్మన్ రామోజీరావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు పార్టీ నాయకులతో కలిసి గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ఈనాడు పత్రికను దహనం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగనన్న పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అమలవుతున్నాయన్నారు. ఎల్లో మీడియా అసత్య కథనాలను ప్రసారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, పొన్నలూరు ఎంపీపీ మాధవ, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, కుందం హనుమారెడ్డి, నల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లేందుకే

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఈనాడులో తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక రాజీవ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏదో ఒక విధంగా అభాసుపాలు చేసేందుకు టీడీపీతో కలిసి ఎల్లో మీడియా కుట్రలు పన్నుతోందన్నారు. అనంతరం ఈనాడు ప్రతులను దహనం చేశారు. సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాల గురవయ్య, పార్టీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబులరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐవీ సుబ్బారావు పాల్గొన్నారు.



యర్రగొండపాలెంలో...



టంగుటూరులో ఈనాడు దినపత్రికను దహనం చేస్తున్న వరికూటి, నేతలు



కనిగిరిలో ఈనాడు పత్రికను దహనం చేస్తున్న చైర్మన్ గఫార్, నేతలు

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ హయాంలో 70 శాతం పదవులు అణగారిన వర్గాలకే
- చంద్రబాబు దృష్టిలో బీసీలంటే ఓటు బ్యాంకు మాత్రమే
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, మహిళా నాయకులు

ఒంగోలు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే ఏలూరులో జరిగిన సభలో బీసీలంటే బ్యాక్‌బోన్ అంటూ బీసీలలో ఎనలేని ఆత్మస్థైర్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నింపారన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి అయిన వెంటనే పేదలు, అణగారిన వర్గాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో బీసీలకు 55 శాతం పదవులు కేటాయిస్తూ బీసీలను అక్కున చేర్చుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో 136 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులు కేటాయించడంతో పాటు మంత్రివర్గంలో 11 మంది బీసీలకు, ఐదుగురు ఎస్సీలకు, ఒక మైనార్టీకి స్థానం కల్పించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. లోక్‌సభలో 8 మంది బీసీలకు, రాజ్యసభలో 50 శాతం బీసీలకు స్థానం కల్పించారని, ఇది దేశ చరిత్రలోనే తొలిసారిగా జరిగిందని వివరించారు. తాజాగా 18 ఎమ్మెల్సీ ఖాళీలు ఉంటే.. వాటిలో 11 బీసీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు కేటాయించి బీసీలంటే రాష్ట్రానికి బ్యాక్‌బోన్ అని మరోసారి సీఎం చాటిచెప్పారన్నారు. కానీ, చంద్రబాబు హయాంలో సమస్యలను ప్రస్తావించిన నాయీబ్రాహ్మణులు, మత్స్యకారులను ఎలా హెచ్చరించారో.. దళితుల గురించి ఎంత నీచంగా మాట్లాడారో.. మహిళల పట్ల చులకనగా ఏ విధంగా వ్యవహరించారో ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలో 45 ఎమ్మెల్సీ స్థానాలుంటే.. వాటిలో 30 ఓసీలకు కేటాయించి 15 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారని విమర్శించారు. ఇదేనా బీసీలపై చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి అంటూ ప్రశ్నించారు. చేనేతల ఆడపడుచుగా తనకు మరోమారు ఎమ్మెల్సీ పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ప్రతి మహిళ, ప్రతి పేద కుటుంబం వైఎస్ జగన్‌కు అండగా ఉండేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

ముందుగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావులు పోతుల సునీతకు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, బడుగు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలకే పెద్ద పీట

- అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్ అడుగులు
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వంలో పెద్ద పీట వేస్తూ సామాజిక న్యాయమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కొనియాడారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి అడుగులోనూ అంబేడ్కర్ భావజాలం ఉట్టిపడుతోందన్నారు. చట్టసభల్లో అవకాశం దక్కించుకోని సామాజికవర్గాలను సైతం గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తూ తాను అందరివాడినని సీఎం చాటిచెప్పారన్నారు. బీసీలంటే కేవలం ఓటు బ్యాంకు అని కాకుండా రాష్ట్రానికి వెన్నుదన్ను అంటూ స్పష్టం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఇప్పటివరకు 36 ఎమ్మెల్సీ స్థానాలు గెలుచుకోగలిగితే.. వాటిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులే ఉన్నారన్నారు. తాజాగా ఏర్పడిన మరో 18 స్థానాల్లో 14 స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. నేడు ప్రభుత్వంలో 70 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో బీసీలకు ఏ మేరకు న్యాయం జరిగిందనేది ఆ పార్టీలో ఉన్న బీసీ నేతలు సైతం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. సీఎం జగన్ లాంటి ముఖ్యమంత్రికి ప్రతిఒక్కరూ అండగా ఉండాలని, పదవి కోసం తహతహలాడుతున్న చంద్రబాబు అండ్ కో లాంటి వారికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 13 జెడ్పీ చైర్మన్ల స్థానాలుంటే వాటిలో 9 పోస్టులు, మేయర్లలో 14 స్థానాలకు గానూ 86 శాతం స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాజ్యసభ స్థానాల్లోనూ సగం బీసీలవేననే విషయాన్ని గుర్తించాలన్నారు. గత 44 నెలల పదవీ కాలంలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1.93 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేశారని, అందులో 76 శాతం లబ్ధిదారులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారేనని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఇచ్చి యువతకు శాశ్వత ఉపాధి కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని, అటువంటి ముఖ్యమంత్రికి అండగా ఉండేందుకు, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజానీకం సమాయత్తం కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 125 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- మార్చి 15 నుంచి థియరీ పరీక్షలకు 95 కేంద్రాలు సిద్ధం
- వివరాలు వెల్లడించిన ఆర్ఐవో సైమన్ విక్టర్



ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని, జిల్లాలోని 125 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షకుడు (ఆర్ఐవో) ఏ సైమన్ విక్టర్ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలను మార్చి 7వ తేదీ వరకు 58 కేంద్రాల్లో, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలను 125 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఇప్పటికే ప్రారంభమయ్యాయని, జనరల్ ప్రాక్టికల్స్ మాత్రం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని అన్నారు. ఈ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 24,243 మంది జనరల్ విద్యార్థులు, 6,784 మంది ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు.

మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు...

మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే జనరల్ థియరీ పరీక్షలకు ప్రథమ సంవత్సరం 24,674 మంది, ద్వితీయ సంవత్సరం 27,487 మంది విద్యార్థులు హాజరవుతారని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. 3,315 మంది ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు, 3,469 మంది ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకుగానూ జంబ్లింగ్ విధానంలో 95 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి పరీక్షల నిర్వహణకు హైపవర్ కమిటీ వేశామన్నారు. ఈ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, ఇంటర్ విద్య ఆర్జేడీ, ఇంటర్ విద్య డీవీఈవో, ఒక సీనియర్ ప్రిన్సిపాల్, ఒక సబ్జెక్టు లెక్చరర్‌ను నియమించామన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కన్వీనర్‌గా ఆర్ఐవోగా తాను వ్యవహరించడం జరుగుతుందని, జిల్లా పరీక్షల కమిటీలో ఇద్దరు సీనియర్ ప్రిన్సిపాళ్లు, ఇద్దరు లెక్చరర్లను నియమించామని అన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం


సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, స్థానిక సంస్థల ఉమ్మడి చిత్తూరు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఆఖరి రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటెత్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్లు స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం అట్టహాసంగా నామినేషన్‌ను ఆర్వో వెంకటేశ్వర్‌కు దాఖలు చేశారు. మధ్యాహ్నం 2.45 గంటలకు నగరి నియోజకవర్గం విజయపురంకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి ధనంజయులు స్థానిక సంస్థల ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు.

ఆఖరి రోజు దాఖలైన నామినేషన్లు ఇలా...

టీచర్, గ్రాడ్యుయేట్ స్థానాలకు ఆఖరి రోజు గ్రాడ్యుయేట్‌కు 17, టీచర్‌కు 5 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ స్థానానికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, పీడీఎఫ్ అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా గ్రాడ్యుయేట్‌కు 39 మంది, టీచర్లకు 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

- ఫేజ్-1లో 4 ప్లాట్‌ఫాంలలో కొనుగోళ్లు
- మార్చి 9 నుంచి ఫేజ్-2లో మరో 7 ప్లాట్‌ఫాంలలో ప్రారంభం
- 101 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు లక్ష్యం



పేర్నమిట్ట సమీపంలో పొగాకు కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్న ఒంగోలు-1 వేలం కేంద్రం

చీమకుర్తి: జిల్లాలో శుక్రవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. టుబాకో వేలం సూపరింటెండెంట్ తులసి తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9 ప్లాట్‌ఫాంలు, నెల్లూరు జిల్లాలోని 2 ప్లాట్‌ఫాంలలో రెండు ఫేజ్‌లలో వేలం జరగనుంది. ఫేజ్-1లో శుక్రవారం నుంచి, ఫేజ్-2లో మార్చి 9 నుంచి కొనుగోళ్లు ప్రారంభంకానున్నాయి. ఫేజ్-1లో ఒంగోలు-1, వెల్లంపల్లి, కొండపి, పొదిలి ప్లాట్‌ఫాంలలో శుక్రవారం కొనుగోళ్లు మొదలవుతాయి. ఫేజ్-2లో ఒంగోలు-2, టంగుటూరు, కందుకూరు-1, 2, నెల్లూరు జిల్లాలోని డీసీ పల్లి, కలిగిరి ప్లాట్‌ఫాంలలో మార్చి నెల 9 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఈ సంవత్సరం 101 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు పొగాకు బోర్డు నిర్ణయించింది. గతేడాది 76 మిలియన్ కేజీల వరకు మాత్రమే అనుమతినిచ్చింది. దాంతో పోలిస్తే ఈ సంవత్సరం అదనంగా దాదాపు 25 మిలియన్ కేజీల కొనుగోళ్లకు అనుమతినిచ్చారు. దానిలో భాగంగా ఒంగోలు-1లో ప్రారంభం రోజున చిలంకూరు గ్రామం నుంచి 45 పొగాకు బేళ్లను కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. మొదటి రోజు ప్రారంభం కానున్న 4 ప్లాట్‌ఫాంలలో దాదాపు 160-180 పొగాకు బేళ్లను కొనుగోలు చేసేందుకు బోర్డు అధికారులు అనుమతినిచ్చారని జిల్లా అధికారులు తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం పొగాకు దిగుబడి ఎక్కువగా ఉండటం, రంగు అనుకూలంగా ఉండటంతో రైతులకు గిట్టుబాటు ధర ఎక్కువగా రావచ్చని అంచనా వేస్తున్నారు. బయ్యర్లు సిండికేట్ కాకుండా ఉంటే రైతులకు మంచి మద్దతు ధర వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఐఓసీలో హైటెన్షన్!

- బీపీసీఎల్ వెలుపల పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు
- రంగంలోకి అగ్నిమాపక దళం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలింపు


పెట్రోల్ ట్యాంకర్‌పై ఫోమ్ వెదజల్లి మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


ట్యాంకర్‌పై నీరు చల్లుతున్న దృశ్యం


క్షతగాత్రులను తరలిస్తున్న రెస్క్యూ బృందం

టంగుటూరు: టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) ఆవరణలో గురువారం హైటెన్షన్ నెలకొంది. ఐఓసీఎల్‌లో పెట్రోల్ నిల్వ చేసే భారీ ట్యాంకర్ నుంచి ఇంధనం లీకై ఆవిరి రూపంలో బీపీసీఎల్ యూనిట్ వైపు ఎగజిమ్మింది. అదే సమయంలో సమీపంలోని ఒక హోటల్లో అగ్గిపుల్ల వెలిగించడంతో మంటలు చెలరేగి బీపీసీఎల్ యూనిట్ వెలుపల ఉన్న పెట్రోల్ బంకులో ఇంధనం అన్‌లోడ్ చేస్తున్న ట్యాంకర్‌కు అంటుకున్నాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళంతోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు రంగంలోకి దిగాయి. నీరు, ఫోమ్ ఉపయోగించి మంటలు అదుపు చేశారు. క్షతగాత్రులు, అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.!

ఇదంతా నిజం కాదు.. మాక్ డ్రిల్!! రాష్ట్ర, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఐఓసీఎల్, బీపీసీఎల్ యూనిట్ల ప్రాంగణంలో ఆఫ్‌సైట్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. అందులో భాగంగానే ఓ ప్రమాదాన్ని సృష్టించి అప్రమత్తంగా వ్యవహరించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ ఆపరేషన్‌ను క్రైసిస్ మేనేజ్‌మెంట్ సెంటర్ నుంచి జిల్లా అధికారులు పర్యవేక్షిస్తూ పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

అప్రమత్తతతో ప్రమాదాల కట్టడి

అవగాహన సమావేశంలో ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు

మాక్ డ్రిల్ అనంతరం తూర్పునాయుడుపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలను ఉద్దేశించి ఆర్డీఓ విశ్వేశ్వరరావు మాట్లాడారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను కట్టడి చేయవచ్చన్నారు. పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినపుడు సిబ్బంది ఏ విధంగా ఎదుర్కోవాలి, సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా ప్రజలు ఎలా సహకరించాలో తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ శివకిరణ్, పరిశ్రమల శాఖ జీఎం మధుసూదనరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నాగిరెడ్డి, జేడీఏ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ ఎస్సైలు ఖాదర్‌బాషా, వెంకటేశ్వరరావు, షేక్ ఫిరోజ్ ఫాతిమా, ఎంపీడీఓ అజిత, విద్యుత్ శాఖ అధికారులు, ఐఓసీఎల్ మేనేజర్ రాజు, ఆపదమిత్రలు, బీపీసీఎల్, భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ సిబ్బంది, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

హత్య కేసులో మహిళకు యావజ్జీవ శిక్ష

మార్కాపురం: అక్రమ సంబంధం వ్యవహారంలో ఆరేళ్ల బాలుడిని హత్య చేసిన ఘటనలో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ గురువారం మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజ వెంకటాద్రి తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణారావు తెలిపారు. బేస్తవారిపేట మండలం సింగరపల్లి గ్రామంలో 2017 మార్చి 13న రామ్‌చరణ్(6) హత్యకు గురయ్యాడు. మృతుడి తల్లి గురవమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి బేస్తవారిపేట ఎస్సై శశికుమార్, గిద్దలూరు సీఐ శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అదే గ్రామానికి చెందిన గొర్ల వెంకటలక్ష్మమ్మ మృతుడి తండ్రి తనతో అక్రమ సంబంధం కొనసాగించకపోవడంతో ఆగ్రహించి రామ్‌చరణ్‌ను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో వెంకటలక్ష్మమ్మకు యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని కోర్టు లైజన్ ఆఫీసర్ ఐవీ శ్రీనివాసరావు తెలిపారు. నిందితురాలికి శిక్ష పడేలా సరైన సాక్ష్యాధారాలు సమర్పించిన సీఐ శ్రీరాం, ఎస్సై శశికుమార్, లైజన్ ఆఫీసర్ ఐవీ శ్రీనివాసరావు, హెచ్‌సీ దస్తగిరిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- కాలువ రక్షణ గోడను ఢీకొట్టిన టూరిస్టు బస్సు

పెద్దదోర్నాల: అదుపు తప్పిన టూరిస్టు బస్సు చప్టాపై నిర్మించిన రక్షణ గోడను ఢీకొట్టడంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని తుమ్మలబైలు గిరిజన గూడెం, జంగిల్ సఫారీల నడుమ గురువారం జరిగింది. ఈ సంఘటనతో ట్రాఫిక్‌కు కొద్దిపాటి అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను చింతల గిరిజన గూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శ్రీశైలం నుంచి దోర్నాల వైపునకు వస్తున్న టూరిస్టు బస్సు ఎదురుగా ఉన్న రక్షణ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన చోటు నుంచి మరో రెండు అడుగుల తర్వాత జరిగి ఉంటే బస్సు కాలువలో పడి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.